క్లుప్తంగా

తరుణి పార్కు పరిశుభ్రం



పార్కును శుభ్రం చేయిస్తున్న కార్పొరేటర్ పి.వి.సురేష్

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు వుడా కాలనీ హరిహర క్షేత్రం ఎదురుగా గల తరుణి పార్కును శనివారం కార్పొరేటర్ పి.వి.సురేష్ దగ్గరుండి శుభ్రం చేయించారు. ఈ పార్కు కొంత కాలం నుంచి అధ్వానంగా ఉండటంతో దీనిలోకి వెళ్లేందుకు స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను కార్పొరేటర్ పి.వి.సురేష్‌కు కాలనీ వాసులు వివరించడంతో స్పందించిన ఆయన.. జీవీఎంసీ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సతీష్‌కు తెలియజేశారు. పారిశుధ్య సిబ్బంది సాయంతో పార్కు ఆవరణ, పరిసరాల్లోని వ్యర్థాలను తొలిగించేలా చర్యలు చేపట్టారు. సమస్య పరిష్కారం కావడంతో కాలనీ వాసులు కార్పొరేటర్ సురేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం శిబిరంలో నిర్వాహకులు, ఆస్పత్రి సిబ్బంది

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెం సమీపాన గల ఆర్‌కేడీ కాలనీలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎస్వీఆర్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో విమ్స్ ఆస్పత్రి వారి సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఎస్వీఆర్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో 2014 నుంచి ప్రతి ఏటా జూలై 12న రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తాము సేకరిస్తున్న రక్తం ఆపదలో ఉన్న వారికి ఉపయోగపడుతుందన్న ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. తమ సేవా కార్యక్రమానికి అండగా నిలుస్తున్న రక్తదాతలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామన్నారు. అనంతరం శిబిరంలో పలువురు రక్తదానం చేశారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో తలంబ్రాలు ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

సిరులతల్లికి తులసిపూజ



దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో తిరుమలేశ్వర రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



శ్రీహరిపురం జంక్షన్‌లో నిలిచిన ట్రాఫిక్

జంక్షన్.. టెన్షన్

- నిత్యం ట్రాఫిక్ జామ్
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- సిగ్నల్ లైట్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్

మల్కాపురం: ఆ జంక్షన్ అంటే వాహనదారుల్లో ఒకటే టెన్షన్. ఎప్పుడు ఈ జంక్షన్ దాటుతామురా దేవుడా అంటూ వారు దేవుడిని కోరుకుంటారు. నిత్యం ఉదయం, సాయంత్రం ఇక్కడ సమస్య ఉన్నా దీనికి ట్రాఫిక్ అధికారులు శాశ్వత పరిష్కారం చూపడం లేదు. దీంతో విద్యార్థులు సకాలంలో విద్యాలయాలకు చేరుకోలేక.. ఉద్యోగులు కార్యాలయాలకు వెళ్లే సమయంలో ఇబ్బందులు పడుతున్నారు.

ఇదీ పరిస్థితి

ఆటు జీవీఎంసీ 58వ వార్డు, ఇటు 60వ వార్డుకు మధ్య శ్రీహరిపురం ప్రధాన మార్గం ఉంది. శ్రీహరిపురం సెంటర్‌లో పలు వాణిజ్య దుకాణాలతో పాటు, కార్పొరేటర్ విద్యా సంస్థలు,ఆస్పత్రులు,ప్రభుత్వ పాఠశాలలతో పాటు ఇళ్లు ఉన్నాయి. దీంతో ఈ జంక్షన్ వద్ద ప్రతి రోజూ ట్రాఫిక్ సమస్య నెలకుంటుంది.ముఖ్యంగా శ్రీహరిపురం నుంచి జవహర్‌నగర్ రోడ్డుకు వెళ్లే సెంటర్‌లో సమస్య అధికంగా ఉంటుంది. నిత్యం ఉదయం 8 నుంచి 10 గంటల సమయంలో.. సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ మార్గంలో ప్రయాణికి చుక్కలు కనిపిస్తాయి. విద్యార్థులు,ఉద్యోగులు,వాణిజ్య దుకాణాలకు ,ఆస్పత్రులకు ద్విచక్ర వాహనాలు,కార్లు,ఆటోల సాయంతో ఈ మార్గాన వస్తుంటారు. అంతా ఒకే సమయంలో రావడంతో పాటు ట్రాఫిక్ నియమాలు పాటించడం లేదు. రోడ్డుకు అడ్డంగా వాహనాలు నిలపడం వంటి సమస్యలు కారణంగా ఇక్కడ ట్రాఫిక్ స్తంభిస్తోంది.ఈ ప్రాంతం విస్తరించినప్పటి నుంచి సమస్య ఉన్నా మల్కాపురం ట్రాఫిక్ అధికారులు శాశ్వత పరిష్కారం చూపలేదు.



శ్రీహరిపురం నుంచి యారాడ పార్కు వరకు నిలిచిన వాహనాలు

సిగ్నల్స్ వేస్తే...

ట్రాఫిక్ సమస్యకు కొంత వరకూ పరిష్కారం చూపాలంటే ఆ సెంటర్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి. రద్దీ సమయాల్లోనైనా సెంటర్‌కు ఇరువైపులా ట్రాఫిక్ పోలీసులు ఉండాలి. అప్పుడు ఇబ్బందులు లేకుండా ప్రయాణం సాగించవచ్చునని వాహనదారులు చెబుతున్నారు.

రోజూ ఇబ్బంది



ప్రతి రోజూ పిల్లలను జవహర్‌నగర్ మార్గం లోని పాఠశాలకు తీసుకు వెళ్తుంటాను. ఆ సమయంలో ట్రాఫిక్ ఇబ్బందుల వల్ల వేరే మార్గంలో చుట్టూ తిప్పి పాఠశాలకు తీసుకువెళ్లాల్సి వస్తుంది. శ్రీహరిపురం సెంటర్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి. -మురళీకృష్ణ, వాహనదారు

అధికారులు దృష్టిసారించాలి



శ్రీహరిపురం సెంటర్‌లో ట్రాఫిక్ సమస్య వల్ల విధులకు వెళ్లే సమయంలో ఇబ్బందులకు గురవుతున్నాను. దీని వల్ల ఒక్కోసారి ఆలస్యంగా వెళ్లాల్సి వస్తుంది. ట్రాఫిక్ సమస్యకు అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలి. లేకపోతే ఇబ్బందులు తప్పవు. - గుడాల బాబూరావు, వాహనదారు

26 మద్యం బాటిళ్ల పట్టివేత

మల్కాపురం: రహస్యంగా ఇంట్లో మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని మల్కాపురం పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు.వారి నుంచి 26 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.వివరాలు ఇలా ఉన్నాయి. 62వ వార్డు దుర్గనగర్ ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు తమ ఇళ్లల్లో రహస్యంగా మద్యం విక్రయిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. సీఐ గొలగాని అప్పారావు ఆధ్వర్యంలో రెండు బృందాలు మద్యం విక్రయిస్తున్న ఇళ్లపై దాడులు చేశారు. ఇద్దరి నుంచి సుమారు 26 బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు.

స్మార్ట్ మీటర్లను తిరస్కరించండి



ఇందిరానగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

గోపాలపట్నం: స్మార్ట మీటర్లను ప్రజలు తిరస్కరించాలని గోపాలపట్నంజోన్ సీపీఎం నాయకులు శనివారం ఇందిరానగర్‌లో పాదయాత్ర నిర్వహించారు. సీపీఎం నాయకుడు బలివాడ వెంకటరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఒత్తిళ్లకు రాష్ట్ర ప్రభుత్వం తలొగ్గిందని విమర్శించారు. వీటి ఖరీదు రూ. 9000 నుంచి రూ.17 వేల వరకు ఉంటుందని తెలిపారు. ఈ భారం వినియోగదారుడే భరించాలని అన్నారు. రీచార్జి చేస్తే కరెంట్ వస్తుందని.. లేక పోతే చీకట్లోనే బతకాల్సి వస్తుందని తెలిపారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం వచిన తర్వాత సర్దుబాటు చార్జీల పేరుతో వినియోగదారులపై రూ.1500 కోట్ల భారం పడుతోందని అన్నారు. సహజ వనరుల ద్వారా వస్తున్న విద్యుత్‌ను వ్యాపార వనరుగా మార్చేశారని వాపోయారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సీఐటీయూ నాయకులు సాంబ మూర్తి, నగేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



మాట్లాడుతున్న ముఖ్య అతిథి ఫాదర్ బాలశౌరీ



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఫాదర్లు, సిస్టర్లు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ క్యాథడ్రల్ చర్చిలో ఆగస్టు 1 నుంచి జరిగే దేవమాత మోక్షారోపణ ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఆర్‌సీఎం విశాఖ ఆర్చి డయోసిస్, చర్చి విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ సంయుక్త ఆధ్వర్యంలో సెయింట్ పీటర్స్ మైదానంలో జరిగిన ఈ పోటీలను జనరల్ రెవరెండ్ ఫాదర్ దగ్గుంపూడి బాలశౌరీ, రెవరెండ్ ఫాదర్ సరిసె ప్రతాప్ ప్రారంభించారు. ముందుగా దేవమాత ఉత్సవాల లోగోను ఆవిష్కరించారు. అనంతరం ఉత్సవాలను ఉద్దేశించి ముఖ్య సందేశం అందించారు. కార్యక్రమంలో జ్ఞానాపురం సహాయ విచారణకర్తలు, రెవరెండ్ ఫాదర్లు, విమల్ రాజ్, ప్రేమ్‌కుమార్, సిస్టర్ రోస్ మేరీ, జూబ్లీ ప్రిన్సిపాల్ ఆంథోనమ్మ, పీపీసీ అధ్యక్షుడు ముసురు రాజేష్‌బాబు, ఏఐసీయూ అధ్యక్షుడు బూర శేషుబాబు, విజయ్‌కుమార్, విక్రాంత్, తేజ, రాఖీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాపాహోం రజతోత్సవం




జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభిస్తున్న పోలీస్ కమిషనర్ బాగ్చి



అలరించిన పాపాహోం పిల్లల ప్రదర్శన

దాబాగార్డెన్స్: పోలీస్ రిజర్వ్ బ్యారెక్స్ ప్రాంగణంలో నడుస్తున్న పబ్లిక్ అండ్ పోలీస్ అసోసియేషన్ ఫర్ స్ట్రీట్ చిల్డ్రన్ (పాపాహోం) 25వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. పోలీస్ కమిషనర్, పాపాహోం చైర్మన్ శంఖబ్రత బాగ్చి, హోం వ్యవస్థాపకుడు కోడె దుర్గాప్రసాద్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పాపాహోమ్ కమిటీ, విద్యార్థులు ఒక ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. పాపాహోమ్ వ్యవస్థాపకుడు కోడె దుర్గాప్రసాద్ మాట్లాడుతూ వివిధ కారణలచే నిరాదారణకు గురైన బాల బాలికలను చేరదీసి, వారిని బాగు చేస్తే మంచి భవిష్యత్ కలిగి చక్కగా జీవిస్తారని, తద్వారా స్థిరపడతారని తెలిపారు. 25 ఏళ్లుగా చక్కని ఆశయాలతో పాపాహోమ్ అభివృద్ధికి కృషి చేస్తున్న కమిటీ సభ్యులు, సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. డిప్యూటీ కమిషనర్ పోలీస్ (లా అండ్ ఆర్డర్) డాక్టర్ అజిత, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ఎం.ఆర్.ఎల్.రాధ పాపాహోం ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాల ప్రశంసించారు. పాపాహోం అధ్యక్షుడు డి.సూర్యప్రకాశరావు అధ్యక్షతన నిర్వహించిన వేడుకల్లో డాక్టర్ అస్లాం ఆరీఫ్, రాజగోపాలరాజు, ఉపాధ్యక్షుడు పంపాన వెంకటేశ్వరరావు, కార్యదర్శి ప్రకాశరావు, కోశాధికారి రమేష్‌చంద్ జైన్, ఎంపీ రాజశేఖర్, ప్రముఖులు పాల్గొన్నారు.

ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాటాలు



వర్ధంతి సభలో పాల్గొన్న సామాజిక కార్యకర్త భగత్‌సింగ్, నాయకులు

తాటిచెట్లపాలెం: మనువాద కార్పొరేట్ ఫాసిజానికి వ్యతిరేకంగా ప్రజా, దళిత, పౌర సంఘాల సమరశీల పోరాటాలు చేయాలని కారంచేడు ఉద్యమ సామాజిక కార్యకర్త భగత్‌సింగ్ పిలుపునిచ్చారు. సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో కారంచేడు దళిత అమరవీరుల 40వ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారంచేడులో 1985 జూలై 17న దళితుల నెత్తురు ఏరులై పారిందని, ఒక పథకం ప్రకారం చుట్టుపక్కల గ్రామాల కమ్మ భూస్వామ్య వర్గం అధికార మదంతో జరిపిన దాడిలో ఐదుగురు దళితులు అసువులు బాసారని, సుమారు 100 మందిని వెంటపడి తీవ్రంగా గాయపరచి, మహిళలపై అత్యాచారాలు చేశారని నాటి సంఘటలను గుర్తు చేసారు. ఆనాటి ఉద్యమానికి, బాధిత దళితులకు దళిత సంఘాలు, అంబేడ్కర్ సంఘాలు, విప్లవ పార్టీలు, కమ్యూనిస్టు పార్టీలు అండగా నిలిచాయన్నారు. న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకుడు వై.కొండయ్య మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులు తమ అజెండాను శక్తివంతంగా అమలు చేసేందుకు ప్రజల మధ్య విద్వేషాలను సృష్టించి, ప్రజాపోరాటాలను దెబ్బతీయగలిగే శక్తులను అన్వేషించాయని తెలిపారు. మన్మోహన్ సింగ్‌ని, కాంగ్రెస్‌ని పక్కన బెట్టి, మరోవైపు కాంగ్రెస్ హయాంలో దేశంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని కార్పొరేట్ శక్తులు తమ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేశాయన్నారు. కార్యక్రమంలో సావిత్రీబాయి పూలే ట్రస్ట్ చైర్‌పర్సన్ గూడూరు సీతామహలక్ష్మి, న్యూ డెమోక్రసీ కార్యదర్శి ఎం.వేంకటేశ్వర్లు, ఏరియా కమిటీ నాయకులు కె.నిర్మల, భీం సేన వార్ అధ్యక్షుడు కె.చిన్నారావు, పివోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.లక్ష్మి, దళిత విముక్తి కన్వీనర్ ఎస్.వి.రమణ, భారత నాస్తిక సమాజం జీడీ సారయ్య, ప్రజాపోరు ప్రతినిధి దేవా, ప్రజా సంఘాల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

వైభవ వేంకటేశ్వరుడికి విశేష సేవలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం విశేష సేవలు జరిగాయి. తెల్లవారుజామున సన్నిధిగొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపించారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం బాలభోగం, శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, రాజభోగ నివేదన చేశారు.

నేడు బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గులిగిండల కృష్ణ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం జరగనుంది. కార్యక్రమానికి పార్టీ పశ్చిమ సమన్వయకర్త,మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. కూటమి చేసిన పాపాలు, హామీలు అమలు చేయకుండా చేస్తున్న తప్పుడు ప్రచారంపై మళ్ల ప్రసంగిస్తారని వార్డు కార్పొరేటర్ గులిగిండల లావణ్య తెలిపారు. వార్డులోని నాయకులతో పాటు కార్యకర్తలంతా హాజరు కావాలని ఆమె కోరారు.

భక్తులకు అన్నసమారాధన



భక్తులకు అన్నప్రసాదాలు వితరణ చేస్తున్న దొడ్డి లక్ష్మి

గోపాలపట్నం: కొత్తపాలెం ప్రసన్న వేంకటేశ్వర ఆలయంలో శనివారం అన్న సమారాధన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో 89వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు దొడ్డి లక్ష్మి పాల్గొని భక్తలకు అన్నప్రసాదాలు వితరణ చేశారు. స్థానిక నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం



శెట్టి అబ్రహం

మల్కాపురం: ఫోన్ చూస్తుండగా తండ్రి మందలించాడని మనస్థాపం చెందిన ఓ బాలుడు ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. రామ్మూర్తిపంతులు పేట గవర కంచరపాలెంలో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న శెట్టి అబ్రహం పెందుర్తి ఐటీఐలో చదువుతున్నాడు. ఈ నెల 10న ఉదయం 10 గంటల సమయంలో సెల్‌ఫోన్ చూస్తుండగా తండ్రి మందలించడంతో ఇంట్లో నుంచి వెళ్లి ఇంతవరకూ తిరిగి రాలేదు. కొడుకు కోసం అంతటా గాలించినా ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో తండ్రి హరిదాసు కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని పోలీసులు కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బుల్లయ్య కాలేజీలో నైపుణ్య శిక్షణకు సీఐటీడీ ఒప్పందం

మురళీనగర్: నగరంలోని డాక్టర్ లంకపల్లి బుల్లయ్య ఇంజినీరింగ్(అటానమస్) కాలేజీలో విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చేందుకు సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్(సీఐటీడీ) ముందుకు వచ్చింది. ఈ మేరకు శనివారం బుల్లయ్య కాలేజీ, సీఐటీడీల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా సీఐటీడీ ప్రిన్సిపల్ డైరెక్టర్ విజయ్ కృష్ణకాంత్ మాట్లాడుతూ తమ సంస్థ కాలేజీల్లోని ఇంజినీరింగ్ విద్యార్థులకు ఇండస్ట్రీ 4.0 అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇస్తామని తెలిపారు. బుల్లయ్య కాలేజీ కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ మాట్లాడుతూ సమకాలీన సాంకేతిక పరిజ్ఞానాన్ని అధ్యాపకులు అందిపుచ్చుకోవాలన్నారు. ఇంజినీరింగు కోర్సులు చేస్తున్న అన్ని బ్రాంచీల వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా కోర్సులు నిర్వహిస్తామని తెలిపారు. ముందుగా డిజైన్ కోర్సులైన ఆటో క్యాడ్, కెటియా, ప్రోయీ, సాలిడ్ వర్క్స్, స్టాడ్ ప్రో, ఆటోమేషన్ కోర్సులు నిర్వహిస్తారని, ఈ మేరకు సీఐటీడీ, బుల్లయ్య కాలేజీల మధ్య అవగాహన ఒప్పందం కుదిరినట్లు చెప్పారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ దీపక్ చౌదరి, ఎంఎస్ఎంఈ అడ్వైజర్ కె.ఎస్.ఎస్.ప్రకాశరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

హాకర్స్ జోన్ కేటాయించడానికి చర్యలు



గుల్లలపాలెంలో నిర్మించిన హాకర్స్ జోన్ ఇదే

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడాకాలనీలోని మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో నిర్మించిన హాకర్స్‌జోన్‌ను తోపుడుబళ్ల వ్యాపారులకు కేటాయించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. 2014లో తోపుడు బళ్ల వ్యాపారుల కోసం సుమారు 32 షాపులు జీవీఎంసీ అధికారులు ఏర్పాటు చేశారు. అయితే ఇక్కడకు వచ్చేందుకు వ్యాపారులు నిరాకరించడంతో నాటి నుంచి ఇవి ఖాళీగా ఉన్నాయి. దీంతో ఈ హాకర్స్ జోన్ ఆకతాయిలకు అడ్డాగా మారింది. మరి కొందరు అనధికారికంగా వ్యాపారాలు చేస్తున్నారు. ఇది గమనించిన అధికారులు వారిని ఖాళీ చేయించారు.వీటిని తిరిగి తోపుడు బళ్ల వ్యాపారుల కోసం ఇస్తున్నామని, రెండు మూడు వారాల్లో ప్రక్రియ పూర్తవుతుందని అధికారులు వివరిస్తున్నారు.

భక్తులతో సింహగిరి కిటకిట



నీలాద్రిగుమ్మం వద్ద భక్తుల రద్దీ

సింహాచలం : సింహగిరి శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకున్నారు. రెండవ శనివారం సెలవురోజు కావడంతో పలుపాఠశాలలు, కళాశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకున్నారు. గిరి ప్రదక్షిణరోజు 32 కిలోమీటర్లు ప్రదక్షిణ చేసి, సింహగిరి పైకి వెళ్లని పలువురు భక్తులు కూడా వచ్చారు. భక్తులతో దర్శన క్యూలు, ప్రసాద విక్రయశాల, కేశఖండనశాల, అన్నప్రసాద భవనం కిటకిటలాడాయి.

సోలార్ విద్యుత్‌తో బహుళ ప్రయోజనాలు



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఈఈ బి.కె.నాయుడు

గాజువాక: గృహ విద్యుత్ వినియోగదారులు సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకోవడంద్వారా వివిధ ప్రయోజనాలు పొందవచ్చని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.కె.నాయుడు అన్నారు. సోలార్ విద్యుత్ ప్రయోజనాలపై శ్రీనగర్‌లో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా బ్యాంకు నుంచి రూ.78 వేలు సబ్సిడీ పొందవచ్చన్నారు. ఈ పథకంలో బీసీలకు అదనంగా మరో రూ.20వేల సబ్సిడీ లభిస్తుందన్నారు. ఎస్సీ సామాజికవర్గానికి చెందినవారు ఈ పథకాన్ని పూర్తిగా ఉచితంగా పొందవచ్చన్నారు. సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకోవడంవల్ల వినియోగదారుల విద్యుత్ బిల్లు చెల్లించాల్సిన అవసరం ఉండదని, మిగులు విద్యుత్ ఉంటే ప్రభుత్వమే తీసుకొని నగదు చెల్లిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా సోలార్‌పవర్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో 72వ వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్, 71వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు, మాజీ కౌన్సిలర్ పప్పు రాజారావు, ఏపీఈపీడీసీఎల్ ఏడీఈ చంద్రశేఖర్, ఏఈ రామకృష్ణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.